WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు వ్యక్తి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989894528

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

వరంగల్

శనివారం 19 అక్టోబర్ 2024

పేజీలు :8

హన్మకొండ - భూపాలపల్లి - ములుగు - మహబూబాబాద్ - జనగాం



# కాంగ్రెస్‌లో వర్గపోరు

ఇందిరమ్మ రాజ్యంలో కమిటీల కొట్లాట

ఎమ్మెల్యేలు వర్సెస్ ప్రత్యర్థి వర్గాలు

పరస్పరం తీవ్ర విమర్శలు, హెచ్చరికలు

రాస్తారోకోలు, ధర్నాలతో రచ్చరచ్చ

అవసరమైతే ఢిల్లీకి వెళ్తామంటూ వార్నింగ్

రోజురోజుకూ పెచ్చుమీరుతున్న గొడవలు

తాజాగా గాంధీభవన్ వద్ద వేలేరు నేతల నిరసన

కాంగ్రెస్‌లో 'ఇందిరమ్మ కమిటీ'లు పార్టీకి కొత్త తలనొప్పి తీసుకొచ్చినట్లయింది. ఇప్పటికే రేవంత్ సర్కారు కొలువుదీరినప్పటి నుంచి ఉమ్మడి వరంగల్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు కొద్దిరోజులుగా భగ్గుమంటోంది. దీనికి తోడు ఇటీవల సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటుచేయాలనుకున్న 'ఇందిరమ్మ కమిటీ'లతో మరింత ముదిరి కుమ్ములాటలకు దారితీసింది. ముఖ్యంగా స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్‌లో పరిస్థితి తారస్థాయికి చేరింది. కమిటీలో తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్తగా వచ్చిన వారు పెత్తనం చెలాయిస్తున్నారంటూ పార్టీనే నమ్ముకొని ఉన్న సీనియర్లు, ఎమ్మెల్యే వర్గంపై ఆగ్రహంతో ఉండగా రోజుకో చోట రాస్తారోకోలు, నిరసనలతో పాటు దిష్టిబొమ్మల దహనాల దాకా వెళ్లింది. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే లకు వార్నింగ్‌లు, పరస్పరం విమర్శల నడుమ కొందరు గాంధీభవన్ మెట్లెక్కగా, ఇంకొందరు అవసరమైతే ఢిల్లీకైనా వెళ్తామనడం అంతటా చర్చనీయాంశమవుతోంది.

2 లో

# సర్వర్ డౌన్ వైద్యసేవలు ఆలస్యం

అనుభవం లేని ఆపరేటర్లు.. రిజిస్ట్రేషన్‌కు గంటలకొద్దీ ఎదురుచూపులు

మూడు రోజులకు ల్యాబ్ రిపోర్టులు

ఏజెన్సీల చేతివాటం.. రోగులకు సంకటం

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

భూపాలపల్లి జిల్లా దవాఖానలో నిత్యం ఇదే పరిస్థితి

2 లో



# కాంగ్రెస్‌లో వర్గపోరు

**వరంగల్**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులే సభ్యులుగా ఉంటున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారి చైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు కౌన్సిలర్, కార్పొరేటర్ చైర్మన్‌గా వార్డు/డివిజన్ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. గ్రామ, పట్టణ ఇందిరమ్మ కమిటీల్లో స్వయం సహాయ సంఘాల్లోని ఇద్దరు మహిళలు.. మరో ముగ్గురు సాధారణ వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. వీరు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉండాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. కమిటీల్లో నియమించే స్వయం సహాయక సంఘాల మహిళలు, మరో ముగ్గురు సభ్యుల పేర్లను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరు కలెక్టరుకు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అనంతరం ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి ఆమోదం తర్వాత నియమాకం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులనే ఈ కమిటీల్లో సభ్యులుగా పెడుతున్నారు. దీంతో ఆ పార్టీలోని వారి మధ్య వర్గపోరు తీవ్రమవుతున్నది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ వారిని ఈ కమిటీల్లో నియమించడవం వల్ల ఇండ్ల కేటాయింపులో అర్హులకు న్యాయం జరగదనే విమర్శలు పెరుగుతున్నాయి. అధికార పార్టీ వారికి మేలు చేసేందుకే ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని అభిప్రాయం ఉన్నది.

**మానుకోటలో ఏకపక్ష వైఖరిపై తీవ్ర అసంతృప్తి**

మహబూబాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటులో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండల స్థాయి కాం గ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వైఖరి మార్చుకోవాలని హెచ్చరిస్తున్నారు. పార్టీ శ్రేణుల మనోభావాలను పట్టించుకోకుంటే పొలిమేర వరకు తరిమికొడతామని వార్నింగ్ ఇస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ వర్గపోరు నడుస్తున్నది.

**స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఢీ అంటే ఢీ**

సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కాంగ్రెస్ పార్టీలోనే ఘర్షణలకు కారణమవుతున్నది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ కమిటీలు కాంగ్రెస్‌లో వర్గపోరును పెంచుతున్నది. గ్రామాల్లోని కాంగ్రెస్ వర్గపోరు అక్కడక్కడా ఎమ్మెల్యేలకు వార్నింగ్‌లు ఇచ్చేదాకా వెళ్తున్నది. బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉన్న స్టేషన్ ఘన్‌పూర్‌లో ఈ కమిటీల గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. శ్రీహరి వర్గం గ్రామాల్లో పెత్తనం చేస్తుండడంపై మొదటినుంచి కాంగ్రెస్‌లో ఉన్న వారు తీవ్ర అసంతృప్తితో ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేసే వరకు వెళ న్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మండల స్థాయిలోని నేతలంతా కడియం వర్గంతో ఢీ అంటే ఢీ అంటున్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి తమకు ఇందిరమ్మ కమిటీలలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**పరకాల, జనగామ, ఇల్లెందులో అదే తీరు..**

పరకాల నియోజకవర్గంలోనూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో కాంగ్రెస్ గ్రూపు పోరు నివురుగప్పిన నిప్పులా ఉన్నది. మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కొత్త గొడవలను సృష్టిస్తున్నది. జనగామ, ఇల్లెందు నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలు ముదురుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఈ ప్రక్రియ వేగవంతమైతే అన్ని చోట్ల కాంగ్రెస్‌లోని వర్గాలు బహిరంగంగా పోటీ పడే పరిస్థితి కనిపిస్తున్నది.

# సర్వర్ డౌన్ వైద్యసేవలు ఆలస్యం

**జయశంకర్ భూపాలపల్లి,**

సర్వర్ డౌన్. ఇది భూపాలపల్లిలోని జిల్లా ప్రధాన దవాఖాన(వంద పడకల ఆసుపత్రి)లో నిత్యం వినిపించే పదం. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి రోజూ వందల సంఖ్యలో ప్రజలు చికిత్స కోసం వస్తుండగా ప్రతి రోజూ ఓపీ 1500 దాటుతుంది. అయితే ఓపీ మొదలు ల్యాబ్ రిపోర్టులు తీసుకొని చికిత్స చేయించుకునే దాకా అన్నీ ఆన్‌లైన్‌తో ముడిపడితో ఉంటుంది. కానీ రోగుల తాకిడికి అనుగుణంగా అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడం, సర్వర్ సమస్యల వల్ల పేషెంట్లు, అటెండెంట్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సర్వర్‌డౌన్ కారణంగా ఓపీ, ల్యాబ్ రిజిస్ట్రేషన్, రిపోర్టులు తీసుకోవడం, చివరికి మెడిసిన్ తీసుకోవడం వరకు ప్రతీ చోట గంటల తరబడి ఎదురుచూడడం ఇక్కడ నిత్యకృత్యమైంది. దీనికి తోడు అనుభవం లేని ఆపరేటర్ల వల్ల రిజిస్ట్రేషన్ మరింత ఆలస్యమై రోగుల ఓపికకు పరీక్ష పెడుతోంది. ఆరోగ్యం బాగా లేదని దవాఖానకు వస్తే ఇక్కడే ప్రాణంపోయేలా ఉన్నదని మండిపడుతున్న తీరు అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతున్నది.

శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సర్వర్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోగా షుగర్ వ్యాధి పరీక్షలు చేయించుకునేవారు, ఎమర్జెన్సీ పరీక్షలు(వార్డుల్లో ఉండే వారు) చేయించుకునే వారు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలు ముడుపులు తీసుకొని అర్హత లేనివారిని నియమించడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ల్యాబ్ రిపోర్టులు సర్వర్‌డౌన్‌తో మూడు నాలుగు రోజులకు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఉన్నతాధికారుల పర్యావేక్షణ కొరవడడంతోనే కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు మండిపడుతున్నారు.

**ఈ ఆసుపత్రే పెద్ద దిక్కు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ ఆసుపత్రే జనాలకు పెద్ద దిక్కు. జిల్లాలోని మారుమూల ప్రజలతో పాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇరు రాష్ట్రాల ప్రజలకు అనువుగా ఉంటుందని బీఆర్ఎస్ ప్రభు త్వం భూపాలపల్లిలో వంద పడకల దవాఖాన నిర్మించింది. ఇది వేలాదిమందికి సంజీవనిగా మారింది. అయితే ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ లేక, ఏజెన్సీ కాంట్రాక్టర్ల చేతివాటంతో ప్రజలకు శాపంగా మారింది. జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాలు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం, 65 పల్లె దవాఖానలు, 90 సబ్ సెంటర్లు, ఒక జిల్లా దవాఖాన ఉన్నాయి. అయితే అన్ని దవాఖానల నుంచి ప్రతిరోజూ మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లికి సిఫారసు చేస్తుంటారు. ఈక్రమంలో జిల్లా దవాఖానకి తాకిడి పెరుగుతుండగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

**అనుభవం లేని ఆపరేటర్లే అసలు సమస్య**

జిల్లా దవాఖానలో అనుభవం లేని కంప్యూటర్ ఆపరేటర్లతోనే అసలు సమస్య వస్తోంది. నియమించే ముందు వారికున్న కంప్యూటర్ పరిజ్ఞానం ఏమిటి? సర్టిఫికెట్ ఒరిజనలేనా? టైపిం గ్ స్పీడ్ ఎంత అనే కనీస అర్హతలు చూడకుండా ఏజెన్సీ కాం ట్రాక్టర్ ముడుపులు తీసుకుని నియమించడంతో ఒక్కో రిజిష్ట్రేషన్‌కు పావు గంట వేచి చూడాల్సి వస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో ఓపీ, ల్యాబ్ రిజిస్ట్రేషన్, ల్యాబ్ రిపోర్టులు ఇచ్చే విభాగం, మెడిసిన్ ఇచ్చే కౌంటర్ వద్ద ప్రధానంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. వీరి పనితీరును ఉన్నతాధికారులు ఏనాడూ పర్యవేక్షించకపోవడంతో వారే పర్మినెంట్ ఉద్యోగులుగా చెలాయిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

## చట్నీస్‌లో అంతే

### పాచిన పిండి, కుళ్లిన ఉల్లి

**హైదరాబాద్ :** పేరుకు స్టార్ హోటల్స్.. వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తే కానీ, వాటి అసలు రంగు బయటపడడం లేదు. అన్నీ హోటల్స్ ఒకేలా ఉండవని అనుకున్నా, ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలలో బయటపడే అక్కడి స్థితిగతులు గమనిస్తే.. ఎంచక్కా ఇంట్లో పచ్చడి మెతుకులు తిన్నా మేలే అనిపించక మానదు మనకు.ప్రస్తుత కాలంలో ఎవరి లైఫ్ చూసినా బిజీబిజీ. టైం కి ఆహారం కూడా తయారు చేసుకోలేని బిజీ లైఫ్ కొందరిది. అందుకే హోటల్స్ బాట పడుతున్నారు కొందరు. ఇదే ఆసరాగా తీసుకున్న కొన్ని హోటల్స్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేస్తున్నాయి. ఇటువంటి వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ తనిఖీలతో కొందరు హోటల్స్, రెస్టారెంట్ యజమానులు బెంబేలెత్తి పోతున్నారు. మరికొందరు మాత్రం ఈ తనిఖీల వల్ల అంతా మేలు జరుగుతుందని తెలుపుతున్నారు.ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్ లోని కొండాపూర్ లో గల శరత్ సిటీ మాల్ లో గల చట్నీ టిఫిన్ సెంటర్ ను శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసినట్లు తమ ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించారు. అయితే ఈ తనిఖీలో అక్కడ ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ లైసెన్స్ కనిపించేవిధంగా ప్రదర్శించబడలేదన్నారు. అలాగే ముడిసరుకు నిల్వ చేసే ప్రదేశంలో అధికారులకు బొద్దింకలు కనిపించగా అవాక్కయ్యారట. అంతేకాదు రవ్వ, పిండి పదార్థాలకు నల్ల పురుగులు ఉండగా అధికారులు అసహనం వ్యక్తం చేశారు. ఇక ఉల్లిపాయలు, క్యాబేజీ చూసిన అధికారులు మరింత ఆగ్రహం వ్యక్తం చేసి, ఇటువంటి చర్యలు మరలా పునరావృతమైతే చర్యలు తప్పక తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ చూసినా దుర్గంధం రావడంతో అధికారులు జరిమానా విధించినట్లు సమాచారం.అలాగే అల్వార్ టిఫిన్ సెంటర్ లో కూడా తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అక్కడ కూడా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు గుర్తించి వారిని కూడా హెచ్చరించారు. ఇలా అధికారుల తనిఖీలు సాగుతున్నంత సేపు.. చుట్టు ప్రక్కల హోటల్స్ యజమానులు హోటళ్లను మూసివేయడం విశేషం. స్థానిక ప్రజలు మాత్రం తనిఖీలకు అదేశాలిచ్చిన ప్రభుత్వానికి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు అభినందనలు తెలిపారు.ప్రతిరోజూ అధికారుల తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని హోటల్స్, రెస్టారెంట్ లకు జరిమానాలతో సరిపెట్టకుండా.. సీజ్ చేయాలన్న అభిప్రాయాన్ని స్థానిక ప్రజలు వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న హోటల్స్ పై నిఘా ఉంచి, మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే నిబంధనలు పాటిస్తున్న హోటల్స్, రెస్టారెంట్స్ లకు అవార్డులు కూడా ప్రకటిస్తే బాగుంటుందన్నది భోజన ప్రియుల అభిప్రాయం.

## యాసిడ్‌తో పాల తయారీ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో కల్తీ మాఫియా రెచ్చిపోతుంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కల్తీపాలను తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు అయ్యింది. మేడిపల్లిలో నకిలీ పాలు తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో.. పాల తయారీ కేంద్రంపై మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ పోలీసులు దాడులు జరిపారు. పౌడర్‌తో నకిలీ పాలు తయారు చేస్తున్న గజేందర్ సింగ్ రాజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల చేసిన తనిఖీల్లో..300 కేజీల పన్నీరు, 4 వేల 500 లీటర్ల రిఫైండ్ ఆయిల్, 750 లీటర్ల అసిటిక్ యాసిడ్, 15 లీటర్ల గ్లూకోజ్ లిక్విడ్‌ను సీజ్ చేసారు. దాంతో పాటు 16 వేల 250 కేజీల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజేందర్ పై కేసు నమోదు చేసి పీఎస్‌కు తరలించారు. పీర్జాదిగూడా ప్రాంతంలోనే కాకుండా బోడుప్పల్, ఉప్పల్ ప్రాంతాల్లోనూ పాలు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.ఇదిలా ఉంటే మరోవైపు.. జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి చికెన్ సెంటర్లు. కుళ్లి పోయిన చికెన్ యధేచ్ఛగా అమ్మేస్తున్నాయి. సికింద్రాబాద్ బేగంపేట్ ప్రకాష్ నగర్‌లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్

# అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ సిటీ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి):**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేటలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (వరంగల్ తూర్పు) నందు అతిథి అధ్యాపకుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ వి. రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులు పీజీలో 60 శాతం ఉత్తీర్ణతతో పాటు ఎన్ఈటి/ఎస్ఎల్ఈటీ/ పీహెచ్డీ ఏదైనా అర్హత కలిగి ఉండాలని తెలియజేశారు. ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1, హిస్టరీ -1 పోస్టులకు అభ్యర్థుల నుండి అక్టోబర్ 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ తెలియచేశారు. అభ్యర్థులకు అక్టోబర్ 26న రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలియచేశారు.

# తెలంగాణలో ఐఐఎం ను ఏర్పాటు చేయాలి

**- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**

**- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు వినతి**



**వరంగల్ సిటీ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి):**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం డిల్లీలో ప్రధాన్ నివాసానికి వెళ్లి కొద్ది సేపు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) ఏర్పాటునకు వెంటనే చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. అదేవిధంగా జిల్లాకొక నవోదయ పాఠశాలను నెలకొల్పడంలో భాగంగా తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 23 జిల్లాలలో స్కూల్స్ ప్రారంభించాల్సిందిగా ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి చేయగా, కేంద్ర మంత్రి ప్రధాన్ సానుకూలంగా స్పందించారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీఎంపీపి



**టేకుమట్ల అక్టోబర్18 ప్రజాజ్యోతి న్యూస్ :**

మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన ఎంఆర్పిఎస్ మండల నాయకులు అక్కల మాధవ్ మాదిగ అనారోగ్యంతో మృతి చెందగా టేకుమట్ల మండల మాజీ ఎంపీపీరెడ్డి మల్లారెడ్డి వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేసినారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మహిపాల్ రెడ్డి, కొండ్రఓదెలు, రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**-ఉద్యోగులకు డి.ఏ లు మంజూరు చేయాలి**

**-కానుగంటి రంజిత్ కుమార్**

**-టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**



**కొడకండ్ల / జనగామ , అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) :**

మార్చి 2025 లో జరగబోయే వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ నియోజక వర్గ ఓటర్లుగా ఉన్నత విద్యా సంస్థలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కొడకండ్ల మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్షులు పి. వెంకటాద్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 01/11/ 2018 నుండి 01/11/ 2024 వరకు గల ఆరు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, కె.జి.బి.వి లు, గురుకులాలలో పని చేసిన, చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేసుకోనుటకు అర్హులు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న ఐదు డి.ఏ లను వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ఎంఈవో, డిఐఈటి / సిటిఈ కళాశాలల అధ్యాపకుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, గురుకుల పాఠశాలల టైమ్ టేబుల్ సవరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఉపాధ్యాయులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం నూతన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాటు పడాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చిక్కుడు శ్రీనివాస్, గాజల రవి, యం. డి సలవుద్దీన్, మండల అధ్యక్షులు పి. వెంకటాద్రి, మండల ప్రధాన కార్యదర్శి వంగాల సోమయ్య, మండల నాయకులు సి. హెచ్ కనకరాజు, ఆర్. శ్రీనివాస్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు



**వరంగల్ సిటీ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి):**

జిల్లాలో పనిచేయుచున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల మంజూరు కొరకు కృషి చేస్తున్నట్లు టీయూడబ్ల్యూజే, (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామ్ చందర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని బల్దియా ఆవరణలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కొరకు దరఖాస్తు ఫారాలను వరంగల్ టియుడబ్ల్యూజే (ఐజెయు) నాయకులతో కలిసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాం రామచందర్, మట్ట దుర్గ ప్రసాద్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజెయు అధ్యక్షులు రామచందర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టియుడబ్ల్యూజే - ఐజెయు జిల్లా శాఖ పక్షాన మీడియా అకాడెమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి ఆదేశానుసారం వరంగల్ లో వర్కింగ్ జర్నలిస్టుల నుంచి ఇళ్లస్థలాలకు సంబంధించి పూర్తి వివరాలు కోరుతూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. అక్టోబర్ 18 నుంచి 21వ తేదీ వరకు యూనియాన్ ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్ కు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రెస్ క్లబ్ ఈ సీ మెంబర్ విజయరాజ్, ఐజెయు జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణ వెంకన్న , వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి బొల్ల అశోక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఆడేపు సాగర్, ఐ జె యు జిల్లా నాయకులు శ్రీధర్, బాలాజీ, సురేష్, అజయ్, వెంకన్న, సతీష్, కుమారస్వామి, సతీష్, శ్రీహరి, అమీర్, శంకర్, కృష్ణ, శ్రీనివాస్, బాబర్, శ్యామ్, నరసయ్య, రాజు, ముమెన్, గణేష్, మురళి, కృష్ణ ప్రసాద్, రమేష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి





**-భోజనం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి.**

**-వంట చేసే సిబ్బందిని వెంటనే తొలగించాలని ఆదేశం.**

**-గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప కు శోకాజు నోటీస్.**

**రాయపర్తి మండలం అక్టోబర్ 18 ప్రజా జ్యోతి :**

రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను శుక్రవారం ఉదయం ఏడు గంటలకి జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా టాయిలెట్స్ డార్మెంటరీ ఆఫీస్ రికార్డ్స్ పరిశీలించారు. వంటశాలలో ఉదయం బ్రేక్ఫాస్ట్ కోసం ఏమి చేస్తున్నారని ప్రిన్సిపల్ అడగగా ఈరోజు పులిహోర చేస్తున్నామని ఆమె తెలిపారు. దీంతో కలెక్టర్ వంటగదిలోకి వెళ్లి వంటలను పరిశీలించి విద్యార్థులకు పెట్టే పులిహోరను పరిశీలించారు. అందులో పసుపు అన్నం, పోపు గింజలు ఎండుమిర్చి తప్ప ఎలాంటి రుచి పచి లేదని గ్రహించి ప్రిన్సిపాల్ స్వరూప పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి భోజనం పిల్లలకి పెడితే వారి ఆరోగ్యం ఎలా అని నిలదీశారు. గతంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కూడా సాంఘిక సంక్షేమ గురుకుల పాటశాలను తనిఖీ చేసి ఆగ్రహం వ్యక్తం చేసి న, జిల్లా కలెక్టర్ వంటశాలను తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించిన తీరు మారని సిబ్బందిపై ఆగ్రహాన్ని వ్యక్తం వెంటనే వంటశాలలో పనిచేసే సిబ్బందిని తొలగించాలని భోజనంలో నాణ్యత పాటించాలని ఈరోజు పంట తీరుపై మండిపడ్డారు వెంటనే షోకాస్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని తిరుమలాయపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి బ్రేక్ఫాస్ట్ నాన్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

# మీడియా ముసుగులో మూగజీవాల అక్రమ రవాణా...

**-అక్రమంగా రవాణాకు పాల్పడుతున్న ఐదు గురి పై కేసు నమోదు**

**ఏటూరునాగారం, అక్టోబర్ 18, (ప్రజా జ్యోతి)**

మీడియా ముసుగులో మూగ జీవాలను అక్రమంగా తరలిస్తున్న ఐదు గురి పై కేసు నమోదు చేసి డీసీఎం, కారు ను సీజ్ చేశామని ఏటూరు నాగారం ఎస్సై తాజుద్దీన్ వవెల్లడించారు. తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఎస్కార్ట్ వాహనంగా కారు అతివేగంగా వస్తుండడం దాని వెనకాల డీసీఎం వాహనం అతివేగంగా ఒకదాని వెనుక ఒకటి రావడంతో వాహనాలను ఆపి తనిఖీ చేయగా అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న ఐదు గురు ఇందులో ప్రధాన వ్యక్తి ఏటూరు నాగారం మండలం లోని శివపురం కు చెందిన కన్నబోయిన, శీను రిపోర్టర్ గా పని. చేస్తూ సెల్ షాప్ నిర్వహణ చేస్తూ గత కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా మూగ జీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. వాహనాలలో రాత్రిపూట.మూగ జీవాలను తరలిస్తున్న క్రమంలో తన కారును ఎస్కార్ట్ వాహనంగా ముందు వెళ్తూ వాహనాలు దాటిస్తూన్నారు.ఆత్కూరి రవీందర్ తండ్రి చిన్ని. (కమలాపురం మంగపేట మండలం) జైస్లావత్ కుమార్ (గ్రామము దొడ్ల కొత్తూరు ఏటూర్ నాగారం), కొడాలి కృష్ణ (జంగాలపల్లి. ములుగు) ,ఉచిత శ్రీను పైన పేర్కొన్న వ్యక్తులు ముందు ఎస్కార్ట్ వాహనం నెంబర్ AP 16 CA 3656 గలకారులో వెనుక డీసీఎం వాహనం TS 12 VT 4046 గల వాహనంలో 22 మూగజీవాలనుఅక్రమంగా తరలిస్తున్న విరి పై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరిగింది.అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా చూస్తూ ఊరుకునేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏటూర్ నాగారం ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా ఎస్పీ శబరిష్ గారి ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ గారి సూచనల మేరకు. ప్రత్యేక నిఘ ఏర్పాటు చేసి మూగజీవాలు ఇసుక అక్రమ రవాణా అసాంఘిక కార్యక్రమాలపై నిత్యం నిఘా ఏర్పాటు చేయడం జరిగింది వాహనాల తనిఖీలు చేపడుతున్నామన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలతో పాటు ఏటుర్ నాగారం మండలంలో సి సి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ములుగు జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్పీ శబరీష్ గారు నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు.చీకటి మాటున రాత్రులు కొంతమంది వ్యక్తులు అక్రమ సంపాదనకు అలవాటు పడి యూనిఫామ్ ధరించి ఇసుక లారీల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రిపూట సంచరిస్తూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తమకు తెలియదని అపోహాలో ఉన్నారని సీసీ కెమెరాలు నిఘా నేత్రాల ద్వారా నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. జల్సాలకు అక్రమ సంపాదనకు అలవాటు పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలి






**-పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**-టిజిఎస్పి చైర్మన్ మహేందర్ రెడ్డి**

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 18(ప్రజాజ్యోతి) :**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ త్రీ పరీక్షల నిర్వహణపై చైర్మన్ మహేందర్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్,సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు,ఈ సందర్భంగా టిజిఎస్పి చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, ప్రభుత్వం, అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గ్రూప్ త్రీ,టూ, పరీక్షలు నిర్వహణకు యంత్రాంగం పూర్తి సిద్ధంగా ఉండాలని, స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలని, రూట్ మ్యాప్ ల ప్రకారం సిబ్బందిని నియమించి, ఎలాంటి పవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు,మూడు పెపర్స్ లకుగానూ నవంబర్ 17, తేదీన ఉదయం, సాయంత్రం, రెండవ రోజు, 18,న ఉదయం ఒక్క పేపర్ లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, జిల్లాలో (21) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో మహబూబాబాద్ డివిజన్ (13) తొర్రూరు డివిజన్ (8) ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా 7704, మంది పరీక్షలకు హాజరవుతున్నారని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, రెవెన్యూ, ఆర్సిఓ సంబంధిత శాఖల సిబ్బందితో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని పరీక్షల నిర్వహణకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని టీజీఎస్పీ చైర్మన్ కు తెలిపారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్, తొర్రూర్, ఆర్డీవోలు అలివేలు,నరసింహారావు, జెఎన్టియూ ప్రిన్సిపల్ బలరాం నాయక్, తహసిల్దార్ భగవాన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మెర రామాలయంలో భజనలు హరి నామ కీర్తనలు

**పాలకుర్తి అక్టోబర్ 18 ( ప్రజా జ్యోతి ) :**

తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొమ్మెర గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామదాసు పోతన భజన మండలి సోమసత్యం,బొల్లం మల్లేష్ ఆధ్వర్యంలో మూడవరోజు హరి నామ కీర్తనలతో సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించాలను భక్తి భజనలను నిర్వహించడం జరిగిందన్నారు. భజన సభ్యులు నిర్వాహకులు సోమసత్యం, మల్లేష్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ప్రజల్లో భక్తి భావాలను కలిగేందుకు హరినామ కీర్తనలు నిర్వహిస్తున్నామని, మూడు రోజుల నుండి శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఉదయం నుండి భగవద్గీత ఉపన్యాసం నిర్వహిస్తు న్నామని తెలిపారు.



# ఘనంగా బండా ప్రకాష్ జన్మ దిన వేడుకలు.

**-ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటి**




**స్టేషన్ ఘనపూర్ ప్రతినిధి, అక్టోబర్ 18 ( ప్రజాజ్యోతి ) :-**

స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల శివునిపల్లి లో ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గోరంట్ల యాదగిరి ముదిరాజ్ అధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బండా ప్రకాష్ ముదిరాజ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివుని పల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఛైర్మన్ భూర్ల శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిధిగా హాజరు అయి కేక్ కట్ చేసి విద్యార్ధిని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండా ప్రకాష్ ముదిరాజ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిది, నిత్య కృషి వలుడు నిరంతర శ్రమ జీవి అని ముదిరాజ్ జాతి సమగ్రాభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేసే కృషివలుడు అని వారి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్ధిని విద్యార్థులకు పండ్లు పంపిణి చేసిన ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నూరి వెంకటేశ్వర్లు,పెద్దమ్మ తల్లి దేవాలయ ప్రధాన కార్యదర్శి కొండ వేణు, ముదిరాజ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు పిట్టల అనిల్, సభ్యులు పిట్టల అజయ్, నీల శివ లింగం ముదిరాజ్, పాఠశాల సిబ్బంది భూపాల్, భాస్కర్ కుమార్, రేవతి అంగన్ వాడి టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎం.ఆర్.పి.ఎస్ మండలనాయకుడు అక్కలమాధవ్ అనారోగ్యంతో మృతి



**టేకుమట్ల అక్టోబర్18 ప్రజాజ్యోతి న్యూస్ :**

మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన ఎం.ఆర్.పి.ఎస్ మండల నాయకులు అక్కల మాధవ్ మాదిగ అనారోగ్యంతో మృతి చెందగా ఎం.ఆర్.పి.ఎస్-ఎంఎస్ పి.భూపాలపల్లి జయశంకర్ జిల్లా ఇన్చార్జ్ అంబాల చంద్రమౌళి మాదిగ, సిపిఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్. మండల ఇన్చార్జులు రేణికుంట్ల శంకర్ మాదిగ, దూడపాక శ్రీనివాస్ మాదిగ, బిఎస్పి సంగిరవి, రాం రాంచేంద్రు, యాకనపల్లి మల్లయ్య పాల్గొని వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ప్రగాఢసాను భూతి తెలియజేసి వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని శవ యాత్రలో పాల్గొన్నారు.

# విద్యుత్ ఎఈకి పుష్పగుచ్ఛం అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**ఇనుగుర్తి అక్టోబర్ 18(ప్రజా జ్యోతి):**
మండలంలో విద్యుత్ ఎఈ గా విధులు నిర్వహిస్తున్న శశిధర్ ఇటీవల హన్మకొండ జిల్లా లోని నక్కలగుట్ట విద్యుత్ కార్యాలయానికి బదిలి పై వెల్లి భాధ్యతలు స్వీకరించారు.కాగా బదిలిపై వెళ్ళిన శశిధర్ ఇనుగుర్తి మండలంలో అందించిన విద్యత్ సేవలను గుర్తుచేస్తు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురెల్లి సతీష్ పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో సత్కరించారు.

# హైటెక్ వ్యభిచారం...

-నిర్వాహకులు, విటులు అరెస్ట్.
-వ్యభిచారం నిర్వహిస్తున్న వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తాం.
-టాస్క్ ఫోర్స్ ఏసిపి మధుసూదన్.




**హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 18, ప్రజా జ్యోతి :**
సుబేదారి రెవెన్యూ కాలనీలో ఒక ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, విటులను టాస్క్ ఫోర్స్, సుబేదారి పోలీసులు సంయుక్తంగా రైడ్ నిర్వహించి అరెస్టు చేశారు. పూర్తి వివరాల ప్రకారం సుబెదారి రెవెన్యూ కాలనీ హనుమకొండ జిల్లాకు చెందిన ఒక మహిళ ఇల్లు కిరాయికి తీసుకొని ఇతర రాష్ట్రాల నుండి మహిళలను రప్పిచ్చి గత సంవత్సరం నుండి అత్యంత రహస్యంగా ఎవరికి అనుమానం రాకుండా సులభంగా డబ్బులు సంపాదిచలని వ్యభిచారం చేయిస్తుంది. ఈ క్రమంలో 1.తడక అరుణ్, 2. జక్కుల అరవింద్ రంగ శాయిపేటకు చెందిన విటులు మహిళతో ఒప్పందము కుదిర్చి వ్యభిచారం చేస్తుండగా టాస్క్ ఫోర్స్ మరియు సబేదారి పోలీసులు రైడ్ చేసి బాధిత మహిళలను కాపాడి నిర్వాహకురాలు బాణాసి స్వర్ణలత (39)ను తదుపరి విచారణ నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగించడమైనది. టాస్క్ ఫోర్స్ ఎసిపి ఏ.మధుసూదన్ మాట్లాడుతూ ఎవరైనా ఆర్గనైజ్డ్ గా ఏర్పడి మహిళలతో వ్యభిచారం చేయించి నట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడునని, ఇదే వృత్తిగా చేసుకొని రూములు తీసుకొని వ్యభిచారం చేస్తూ పదే పదే దొరికిన నిర్వాహకులపై పి డి చట్టము అమలు చేయబడునని హెచ్చరించినారు. హైటెక్ వ్యభిచార ముఠా గుట్టు రట్టు చేసినందుకు ఇన్స్పెక్టర్ రాజు, ఇన్స్పెక్టర్, ఆర్ఎస్ఐ భాను ప్రకాష్, మిగితా సిబ్బందిని ఏసిపి అభినందించారు.

# నేరస్థుల పై నిరంతర నిఘా ఉంచాలి






-సైబర్ క్రైమ్ బాదితులు కోల్పోయిన డబ్బు త్వరగా రీఫండ్ అయ్యే విధంగా చూడాలియి జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ,IPS

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 18(ప్రజాజ్యోతి) :**
మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్ నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లా లో గత నెలలో నమోదు అయిన యూఐ కేసులు, గ్రేవ్ యూఐ లాంగ్ పెండింగ్‌లో కేసుల పరిష్కారం, ఎస్సీ/ఎస్టీ యూఐ కేసులు, విమెన్ ఎగైనెస్ట్ కేసులు, ఫోకస్సో కేసుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులోఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం,శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు చేయాలి తద్వారా చట్టపరిధిలో నిందితులకి కఠినమైన శిక్షలు పడేలా చూడాలని అన్నారు. యూఐ కేసులను పెండింగ్ లేకుండ త్వరగ విచారణ చేపట్టి కోర్టు లో చార్జీ షీట్ దాఖలు చెయ్యాలని ఆదేశించారు. పోక్సో కేసులలో 60 రోజుల్లో పారదర్శకంగా విచారణ చేపట్టి కోర్టు లలో చార్జి షీట్ దాఖలు చెయ్యాలని ఆదేశించారు. ప్రాపర్టీ నేరాలు జరగకుండ రాత్రి సమయాలలో గస్తీ నీ మరింత పకడ్బందీ గా తిరిగేటట్లు చూడాలని, పాత కేసులలో ఉన్న నిందితులను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. ఉమెన్ మిస్సింగ్ కేసులలో ఏలాంటి కారణాలు ఉన్నప్పటికీ వారిని త్వరగా ట్రేస్ ఔట్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని అన్నారు. ప్రజలు ఆపదలో ఉపయోగించే డయల్ -100 కాల్స్ పట్ల తక్షణమే నిర్ణీత సమయంలో స్పందించాలని , ఏలాంటి ఆలస్యం చేయకుండా సిబ్బంది లేదా అధికారులు సంఘటన స్థలానికి చేరి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్లో పరిధిలో సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ఉపయోగం ప్రాముఖ్యతపై పోలీస్ అధికారులు సిబ్బంది ప్రోయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చెయ్యాలని, పని చెయ్యని సిసి కెమేరాల ను పునరుద్ధరించాలని ఆదేశించారు. సైబర్ బాధితులు కోల్పోయిన, హోల్డ్ చేయబడిన డబ్బును కోర్టు అనుమతులు పొంది త్వరగా బాధితుల ఖాతాలోకి చేరేవిధంగా కృషి చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు బోర్డ్ లు, సూచికలు, సైన్ బోర్డ్ లు, రేడియం బోర్డ్ లు ఏర్పాటు చేయాలన్నారు.మూల మలుపుల దగ్గర హెచ్చరికల బోర్డ్ లు , స్పీడ్ లిమిట్ బోర్డ్ లు ,ఏర్పాటు చెయాలన్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాలు జరగడానికి గల కారణాలను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు.గ్యాంబ్లింగ్, గుట్కా ,గంజాయి ,పేకాట వంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లో తమ తమ పోలీస్ స్టేషన్ల పరిదిలో జరగకుండా చూడాలనీ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఓవర్ లోడ్ తో ప్రయాణికులను తీసుకెళ్లే వాహనాల పై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో ముఖ్యమైన ప్రదేశాలను గుర్తించి సర్కిల్ సిబ్బంది తో నాకాబంది చేపట్టి భారీ వాహనాలను తనిఖీలు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం విజబుల్ పోలీసింగ్లో భాగంగా వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించాలని సూచించారు.అనంతరం జిల్లా లొ ఉత్తమ సేవలు అందించినందుకు గాను పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డ్స్ అందించడం జరిగింది.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పి జోగుల చెన్నయ్య , సైబర్ క్రైమ్ డి.ఎస్పి శ్రీనివాస్ , మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు, సీఐలు,జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు, డిసీఅర్బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి,, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నరేందర్, సైబర్ సీఐ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టాపర్స్ డిస్నీ అకాడమీ ప్రారంభం...





- అత్యాధునిక సౌకర్యాలతో ఐఐటి, నిట్ కోచింగ్

**హన్మకొండ, అక్టోబర్ 18 :**
హనుమకొండ కిషన్ పురలొ నూతనంగా ఏర్పాటు చేసిన టాపర్స్ డిస్నీ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొని రిబ్బన్ కట్ చేసి అకాడమిని ప్రారంభించారు. అనంతరం సెంటర్ హెడ్ అండ్ డైరెక్టర్ చల్లారాజిరెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో స్మార్ట్ బోర్డ్స్, ఏఐ టెక్నాలజీ,డిజిటల్ కంటెంట్, ఐఐటి, నిట్ కోచింగ్లలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఫ్యాకల్టీ, విశాలమైన క్లాస్ రూములు, పరిమితమైన విద్యార్థులతో ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ కలిగి బోధన చేయనున్నట్లు తెలిపారు. ఆరవ తరగతి నుండి 12 వరకు క్లాసులు వారికి ఉదయం 5 నుండి 7:30 వరకు, సాయంత్రం 6 గంటలకు 8 గంటల 30 నిమిషాల వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు ప్రతి ఆదివారం ఎగ్జామ్ నిర్వహించి వారి ప్రతిభ ఆధారంగా ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో ఆ సబ్జెక్టు పైన మరింత శ్రద్ధ పెట్టి బోధన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్ గౌడ్, నాయకులు సుగుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది






## -రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ.

## -వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 18, ప్రజా జ్యోతి :**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని కడిపికొండలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన దేశంలోని ఏకైక ప్రభుత్వం మనదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే బడుగు బలహీన వర్గాలు, రైతుల పక్షపాతి ప్రభుత్వం అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క రైతు కూడా ధాన్యం విషయంలో మోసపోకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయవచ్చునని అన్నారు. రైతులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ తో కలిసి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ. 500 లను బోనస్ ఇవ్వడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ విషయాన్ని రైతులందరూ గుర్తుంచుకోవాలన్నారు. సన్న రకం ధాన్యాన్ని ఎన్ని క్వింటాలు పండిస్తే అన్ని క్వింటాలును కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దొడ్డు సన్న రకం ధాన్యాలను కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దొడ్డు, సన్న రకం దాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రూ. 25 వేల కోట్ల నిధులను ప్రభుత్వం సమకూర్చిందని, రైతులు ధాన్యం అమ్మిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు సన్న బియ్యం అందుబాటులో ఉంటుందన్నారు. 9 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసి ఇంకా మూడు నాలుగు నెలల్లో మరో రూ. 12 కోట్లను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. 43 లక్షల మంది రైతులకు రూ. 30 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. పంటల సాగుకు నాణ్యమైన కరెంటును ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు విద్యుత్తు సమస్యతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి హాస్టల్ ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను వీలైతే సొంత డబ్బులను ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులు ఆటలువైపు దృష్టి సారిస్తారని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని ప్రతి మండలంలో శుక్రవారం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. వరి కోతలకు హార్వెస్టర్ యంత్రాల కొరత లేకుండా ఉండేందుకు వాటి యజమానులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. వరి కోతలకు హార్వెస్టర్ల వినియోగంతో ఎలాంటి తరుగు లేకుండా వస్తుందని అన్నారు. రైతులతో కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరువేరుగా సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ నుండి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తెలుపు, నీలిరంగు టోకెన్లను ఇవ్వాలని ఏఈఓ లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సంబంధించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, అనిత రంజిత్, దర్గా కాజీపేట పిఏసిఎస్ చైర్మన్ వనం రెడ్డి, డి సిఓ నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

## -పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ.

**హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 18, ప్రజా జ్యోతి :**



హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యతో పాటు ఏకరూప దుస్తులు, టెక్స్ట్, నోట్ బుక్స్ పంపిణీ గురించిన వివరాలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతిపాదనలు అందజేస్తే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాజీపేట తహసీల్దార్ బావు సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బతుకమ్మ కుంట వద్ద డ్రైవింగ్ నేర్చుకోకూడదు భైరు వెంకటేశ్వర్లు



**జనగామ జిల్లా అక్టోబర్ 18(ప్రజాజ్యోతి ):-**

జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీ దుర్గమ్మ గుడి వద్ద ఉన్న బతుకమ్మ కుంటలోకి దూసుకెళ్లిన కారు. కారు నేర్చుకుంటుండగా అదుపుతప్పి నీటిలోకి వెళ్లిన కారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటికి రావడం జరిగింది. ఈ సందర్భంగా బతుకమ్మ కుంట వాకింగ్ సంఘం అధ్యక్షులు భైరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. అదృష్టం కొద్ది కారులో ఉన్నవారు కుంట పక్కనే ఉన్న శ్రీ దుర్గమ్మ దయవల్ల బయటపడ్డారని, బతుకమ్మ కుంట చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశం వాకింగ్ చేసే వారి కోసం ఏర్పాటు చేయడం జరిగిందని, కారు నేర్పే నిపుణుల ఆధ్వర్యంలో కారు నేర్చుకోవాలని, మీరు ఇబ్బంది పడకండి అలాగే వాకింగ్ చేసే వారిని ఇబ్బంది పెట్టవద్దు అని కోరారు. బతుకమ్మ కుంట వద్ద కారు లేదా ద్విచక్రవాహనాలు డ్రైవింగ్ నేర్చుకోవడానికి రావద్దు అని, అలాగే వాకింగ్ చేసే సమయంలో క్రికెట్ కూడా ఆడ వద్దు అని నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా పోలీసులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

# ఆదమరిస్తే అంతే సంగతులు

## - ప్రమాదకరంగా ఎస్సారెస్పీ కల్వర్ట్ వాల్



**దామెర, అక్టోబర్ 18, (ప్రజా జ్యోతి):**

దామెర మండల కేంద్రం నుండి ల్యాదల్ల గ్రామానికి వెళ్లే మార్గంలో ఎస్సారెస్పీ కెనాల్ వాల్ కూలింది. బిటి రోడ్డు పై వెళ్లే వాహన దారులు ఆద మరిస్తే అంతే సంగతులు ప్రమాదానికి కావాల్సిందే.. పశువుల కాపర్లు పశువులను మేపడానికి, వ్యవసాయ దారులు, కూలీలు పోలాలకు వెళుతూ ఉంటారు. ఆదమరిస్తే ఇంతే సంగతి అని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కెనాల్ వాల్ కూలి పోయిన చోట ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదని పలువురు వాపోతున్నారు. కొత్తవారు గ్రామంలోకి వాహనాలతో అతివేగంగా వస్తే ప్రమాదానికి ఖచ్చితంగా గురవుతారని తెలుపుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది అని గ్రామస్తులు తెలుపుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎస్సారెస్పీ వాల్ పునరుద్ధరించి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):**

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా నూతన అధ్యక్షుడిగా అబ్బాపూర్ గ్రామానికి చెందిన బాదం ప్రవీణ్ ఎన్నికయ్యారు. ములుగు జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి,జిల్లా అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్, జనరల్ సెక్రటరీగా గురిజాల సహోదర్ రెడ్డి,జిల్లా కోశాధికారిగా ఎలగందుల మోహన్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొమురవెల్లి హరి నాథ్,జిల్లా ఉపాధ్యక్షులుగా కాసిడి సుదర్శన్ రెడ్డి, అక్కల రగోత్తం,జిల్లా సంయుక్త కార్యదర్శులుగా ద్యాగల భద్రయ్య, వివిన్ రెడ్డి,జిల్లా ఈసి మెంబెర్స్ లక్ష్మీనారాయణ,వేలేంధర్ తో పాటు శాశ్వత ఆహ్వానితులుగా అనిల్ కుమార్,శ్రవణ్ కుమార్ లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హసన్ పర్తి మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తుకు అంతరాయం

**హన్మకొండ, అక్టోబర్ 18(ప్రజా జ్యోతి):**

సబ్ స్టేషన్ లలో మరమ్మత్తుల దృష్ట్యా హసన్ పర్తి మండలంలోని జయగిరి సబ్ స్టేషన్ పరిధి, మల్లారెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ప్రాంతాలకు నేడు ఉదయం 9 నుండి 10:30 వరకు విద్యుత్ కు అంతరాయం కలగనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డిఈ సామ్యా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పేదింటి ఆడపిల్లలకు వరం కళ్యాణ లక్ష్మి పథకం.

**-ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.**

**రాయపర్తి మండలం, అక్టోబర్ 18 ప్రజా జ్యోతి :**



పేదింటి ఆడ పిల్లలకు వరం లాంటిది కళ్యాణ్ లక్ష్మి పథకం అని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం రాయపర్తి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో కిషన్ వివిధ శాఖల అధికారులు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎద్దుగూడెం రోడ్డు బీటీరోడ్డు చేయాలని కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి వినతి

**-బిటి రోడ్డు మంజూరుకు హామీ ఇచ్చిన కొమ్మూరి**

**-కాంగ్రెస్ మండల అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి**

**బచ్చన్నపేట అక్టోబర్ 18(ప్రజాజ్యోతి):**



మండలంలోని పెద్దగూడెం గ్రామ వాసులు శుక్రవారం జనగామ డిసిసి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని హైదరబాద్ లోని తన నివాసంలో ఎద్దు గూడెం గ్రామ ప్రజలు కలిసి బి టీ రోడ్ సాంక్షన్ చేయాలని వినతి పత్రం ఇచ్చారు.కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, బి టీ రోడ్ సాంక్షన్ చెపిస్త అని హామీ ఇవ్వడంతో ఎద్దు గూడెం గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బచ్చన్నపేట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నూకల బాల్ రెడ్డి చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లనాగుల శ్వేత వెంకటచారి, ఎద్దు హరీష్, ఎద్దు యాదగిరి, వెంకటేష్, పుల్లయ్య, విగ్నేశ్వర్, సాయిబాబు, మహేందర్, రవీందర్, మహేష్ , తదితరులు పాల్గొన్నారు.

# దూకుడు పెంచిన టాస్క్ ఫోర్స్...





**-బియ్యం అక్రమ రవాణాపై మెరుపు దాడులు..**

**హనుమకొండ జిల్లా ప్రతినిధి/వరంగల్, అక్టోబర్ 18, ప్రజా జ్యోతి:**



అక్రమంగా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఏసిపి మధుసూదన్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌తో పాటు హన్మకొండ పోలీసులు ఒకరిని పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన జన్నే వెంకటేష్ 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం హన్మకొండ పీఎస్ పరిధిలోని పెదమ్మ గడ్డ రోడ్డులో వెళుతుండగా పట్టుబడ్డాడు.

**గీసుగొండలో ఒకరు..**

గీసుగొండ పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. గాంధ్ర శ్రీధర్ గీసుగొండ పీఎస్ పరిధిలో 8.5 క్వింటాలుల బియ్యంతో పట్టుబడ్డాడు. అతడు గీసుగొండ గ్రామం చుట్టుపక్కల నుంచి పీడీఎస్ రైస్ కొనుగోలు చేసి, కోళ్లకు మేత కోసం భద్రకాళి పౌల్ట్రీ ఫారం మొగిలిచర్ల వద్ద డంప్ చేసినట్లు తెలిసిందని ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

**ఆశాలపల్లిలో 31.86 క్వింటాళ్ల బియ్యం పట్టివేత.**

సంగెం మండలం ఆశాలపల్లి గ్రామంలో కిరణ్ కుమార్ పౌల్ట్రీ ఫారాన్ని తనిఖీ చేశారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన గాదె కిరణ్ కుమార్ అక్రమంగా నిల్వ ఉంచిన 31.86 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారుగా 82,836 రూపాయలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. సంగెంమండలం గాడిపల్లి గ్రామానికి చెందిన రాజు పరారీలో ఉన్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, ఆర్ ఎస్సై శరత్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం

**కొడకండ్ల / జనగామ, అక్టోబర్ 18 (ప్రజాజ్యోతి) :**



మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు ఈనెల 16 నుండి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, ఎంపీడీవో పరవస్తు శేషాద్రి సూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ శిక్షణలో సహాయకులకు పైపులైను తెగిపోతే అతికించే విధానం, గ్రామంలోని చేతిపంపుల మరమ్మతులు చేయు విధానం, గ్రామంలో నీటి సమస్యలు రాకుండా ఎలా చూడాలి తదితర విషయాలను శిక్షణలో అందిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, మంచినీటి సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

